పేద విద్యార్థులకు ఉచిత విద్య : డిఇఒ

కడప అర్బన్ : ప్రయివేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచిత విద్య సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని డిఇఒ రాఘవరెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద వర్గాలకు చెందిన పిల్లలకు 25 శాతం ప్రవేశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు 5 శాతం, ఎస్‌సిలకు, 10 శాతం, ఎస్‌టిలకు 4 శాతం, బలహీనవర్గాలకు బిసి, మైనార్టీ, ఒసి విద్యార్థులకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీనవర్గాల కుటుంబాలకు వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో నివసించే వారికి రూ.1.44 లక్షలు ప్రాతిపదికగా తీసుకుని వారి పిల్లలను చేర్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఏప్రిల్ 10వ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

మొక్కుబడిగా..

- రూ.57.47 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్
- పన్ను వసూళ్లలో దురుసుతనం తగదు: డిప్యూటీ సిఎం
- కడపను సుందర నగరంగా తీర్చిదిద్దుతాం
- కడప కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో మేయర్ సురేష్‌బాబు

మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

హాజరైన కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం మొక్కుబడి తంతును తలపించింది. శనివారం కడప కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన రూ.57.47 కోట్లతో ప్రవేశపెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సిఎం అంజద్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పన్ను వసూళ్ల విషయంలో ప్రజలతో సఖ్యతగా మెలగాలన్నారు. 30వ డివిజన్‌లో అడ్వర్టైజ్‌మెంట్ పన్ను వసూళ్ల విషయంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బోర్డును చించడం తదితర వ్యవహారాలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సమీపంలోనే ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో నాలుగు వేలు, ఐదు వేలు వంటి బకాయిదారులపై దాడుల తరహా వాతావరణాన్ని తలపించరాదని సూచించారు. తక్షణ పన్ను వసూలును యూజర్ ఛార్జీలుగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యంతోపాటు నగర సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్‌లో బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించలేకపోయామని చెప్పారు. కడప విస్తీర్ణం ఎక్కువగా ఉందని, ఇందుకు అనుగుణంగా 250 మంది కార్మికులను తీసుకున్నామని తెలిపారు. కడప నగరం అభివృద్ధికి మరిన్ని నిధులు కోరతామని తెలిపారు. 37, 47వ డివిజన్ కార్పొరేటర్లు కడప నగర విస్తరణకు అనుగుణంగా నీటి వనరుల నిల్వ, సరఫరా, సృజన లేదన్నారు. సర్వసభ్య, బడ్జెట్ సమావేశాల్లో తాగునీటి వనరులు మొదలుకుని ఆయా విభాగాలకు చెందిన అధికారులు ఆచరణాత్మక దార్శనికతను కలిగి ఉండాలన్నారు. కార్పొరేషన్ కార్యాలయ అధికారుల్లో జవాబుదారీ స్ఫూర్తి కొరవడడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. స్టాండింగ్ కమిటీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను జిహెచ్‌ఎంసి 197 సెక్షన్ నిబంధనల ప్రకారం మార్పులు చేర్పులు చేసి ఆమోదించే అధికారం సర్వసభ్య సమావేశానికి ఉందని తెలిపారు. ర్యాటిఫై చేసిన తర్వాత మార్పులుచేర్పులు చేయడం కుదరదని చెప్పారు. గత బడ్జెట్‌లో ఎస్‌సి, ఎస్‌టి, స్త్రీ, శిశు సంక్షేమానికి వ్యయం చేసిన ఖర్చుల వివరాలను వెల్లడించాలన్నారు. గతంలో ప్లాన్ తీసుకుని ప్లాన్ డివియేషన్ చేసిన భవనాల సంబంధించి డివియేషన్ చేసిన దానికి గాకుండా భవనం మొత్తానికి పెనాల్టీ విధించడం సరికాదన్నారు. రూ.1000 వచ్చే వారికి రూ.800 వరకు పన్నును ఆందోళన వ్యక్తం చేశారు. గడేదాని ట్రేడ్‌లైసెన్స్‌లకు సంబంధించి రూ.35 లక్షలు అంచనాల్లో రూ.2.57 కోట్లే వసూలు చేశారని కరోనా కారణంగా రెండేళ్లు వ్యాపారాలు సాగని నేపథ్యంలో పన్నులు వసూలు చేయడానికి తీర్మానాలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. 25 ఏళ్ల గడువు దాటిన దుకాణాల లీజుదారుల పట్ల ఉదాసీనతపై ప్రశ్నించారు. అనంతరం మగ్బుల్‌బాషా స్పందిస్తూ 2017లో జిఐఎస్ సర్వే చేసిన అనంతరం 60 శాతం నుంచి 70 శాతం పన్నులు పెంచారన్నారు. 2020లో ఆస్తుల విలువపై పన్నులు సవరించారని తెలిపారు. రూ.46 కోట్లు వసూలు చేయడంలో కమిషనర్ చొరవ అభినందనీయమని తెలిపారు. రంజాన్ పర్వదిన నేపథ్యంలో విద్యుత్ కోతలు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుదల, ఇఫ్తార్ సమయంలో పోలీసుల తనిఖీల కారణంగా ఉపవాసం ఉన్న వ్యక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇటువంటి పోకడలను నిలువరించాలని పలువురు కార్పొరేటర్లు సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి పులివెందుల తరహాలో కడపలో కోటిరెడ్డిసర్కిల్, సెవెన్‌రోడ్స్‌సర్కిల్, కృష్ణాసర్కిల్, అన్నమయ్య సర్కిళ్లతోపాటు ఇతర సర్కిళ్లను అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ స్పందించి నగరాభివృద్ధిలో చర్యల్లో భాగంగా నగరంలోని పలు సర్కిళ్ల ఆధునీకరణ సాగుతోందని పేర్కొనడం గమనార్హం. ఏదేమైనా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపే బడ్జెట్‌పై చర్చను ముగించడం బడ్జెట్‌పై చర్చ, దాని సమగ్రతను ప్రశ్నార్థకం చేసిందనే విమర్శ వినిపిస్తోంది.

సమన్వయంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యం

రాష్ట్ర ప్రణాళిక కార్యదర్శి విజయకుమార్

ప్రజాశక్తి - కడప

అర్హతలున్న ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలనే దృఢ సంకల్పంతో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రణాళిక కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని సభాభవన్‌లోరాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్, అన్న మయ్య జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి అధికారులతో ఎస్‌డిజి, స్పందన అర్జీల పరిష్కారాలపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి హాజరయ్యారు. వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు విజయ్ రామరాజు, గిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ కుమార్ మాట్లాడుతూ. సుస్థిర అభవృద్ధి లక్ష్యాలను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలను పలు సూచికలుగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. 2016-2030 మిలీనియం సమీకృత అభివృద్ధికి, అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రపంచ వ్యాప్తంగా 8 అంశాలు, 18 లక్ష్యాలు, 56 సూచికలతో ప్రణాళిక సిద్ధం చేసిందని చెప్పారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం, వాటిని పరిష్కరించడం వంటి చర్యలు దశాబ్దాల కాలంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమమే అయినా, అన్ని జిల్లాల్లోని మండలాల్లో, గ్రామ సచివాలయాల పరిధిలో అతి తక్కువ నిర్ణీత సమయంలో, నాణ్యతతో కూడిన పరిష్కారం, సంతృప్తి కరమైన ఫీడ్ బ్యాక్ ను స్వీకరించడంలో ముందంజలో ఉన్నామన్నారు. కడప జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ ఎస్‌డిజి లక్ష్యాలను, స్పందన అర్జీల పరిష్కారం సాధించడానికి అవసరమైన సూచనలు చేసే విధానంలో సమీక్ష సమావేశానికి ఒక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పి.ఎస్. మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు విభిన్న ఆలోచనలు ఉంటాయన్నారు. సమస్య ను గుర్తించి, పరిష్కారం కోసం దృష్టి పెడితే తప్పక మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ముందుగా ముఖ్య అతిధులు తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్ర్యమంలో వైఎస్‌ఆర్ జిల్లా ఎస్‌పి అన్బురాజన్, రెంవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు ధర్మచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, సిపీవో వెంకటరావు, రెండు జిల్లాల నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక కార్యదర్శి విజయ్‌కుమార్

డిడి అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ : డిఎస్‌పి

మాట్లాడుతున్న రాయచోటి డిఎస్‌పి శ్రీధర్

ప్రజాశక్తి-రామాపురం

కడప జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిన్న అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ చేపడతామని రాయచోటి డిఎస్‌పి శ్రీధర్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక రామాపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు అదృశ్యమై శవమైన కనిపించిన అచ్చనపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామన్నారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వల చెరువు ఘాట్ రోడ్డులోని కోనేటి బండల సమీపంలో శుక్రవారంచిన్న అచ్చన్న శవమై కనిపించినట్లు ఆ గ్రామం విఆర్‌ఒ కల్లూరు ఫాతిమాబి ఫిర్యాదు చేశారని తెలిపారు. తమ సిబ్బంది అక్కడికి వెళ్లారని ఆయన మృతికి సంబంధించిన ఆనవాళ్లు, మృతుని వద్ద ఉన్న ఆనవాళ్ల మేరకు కుటుంబీకులకు సమాచారం అందించమని పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె సిఐ వరప్రసాద్, రామాపురం ఎస్ఐ కొండారెడ్డి. సంఘటన స్థలాన్ని చేరుకొని మృతిని శవ పంచనామ కోసం డాక్టర్‌ను సంఘటన స్థలానికి పిలిపించి శవ పంచనామా జరిపించమన్నారు. అచ్చన్న మృతదేహాన్ని ఆయన కుటుంబీకులకు శుక్రవారం రాత్రి పొద్దుపోయాక అందజేశామన్నారు. పశు సమర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ చిన్న అచ్చన్న విధులు నిర్వహిస్తున్న సమయంలో సస్పెన్షన్‌కు గురైనట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఆ నోటీసులు తీసుకున్నందుకు మనస్థాపానికి గురయ్యారని సమాచారం ఉందన్నారు. కుటుంబీకులు, ఆ శాఖ అధికారులను సమగ్రంగా విచారిస్తే తనంతకు తానే చనిపోయాడా ఇతర కారణాలు ఉన్నాయా అనే విషయంపై సమగ్రంగా విచారణ చేస్తామన్నారు.

కెసి కెనాల్ బాధితులకు ప్రత్యామ్నాయం కల్పించాలి

కడప అర్బన్ : నగరంలోని కెసి కెనాల్ కట్ట పక్కన రోడ్డు విస్తరణ పేరుతో పేదలకు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతనే అక్కడి నుంచి ఖాళీ చేయించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్తార్, సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, సిపిఐ నగర డిప్యూటీ కార్యదర్శి కే.సీ. బాదుల్లా, బిఎస్‌పి రాష్ట్ర నాయకులు గుర్రప్ప, లోక్ సత్తా నాయకులు దేవర కృష్ణ, రాయలసీమ కమ్యునిస్టు పార్టీ నగర కార్యదర్శి మగ్బుల్ బాషా, ఎంఆర్‌ఎఫ్ నాయకులు దస్తగిరి విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీ కెనాల్ కట్ట పక్కన ఇళ్లు వేసుకుని నివాసం ఉం టున్న ప్రజలను తక్షణమే ఖాళీ చేయాలని డిమాండ్ చేయటం సమంజసం కాదన్నారు. 30 సంవత్సరాలుగా అక్కడ స్థలాలు కొని నివాసం ఉంటున్న ప్రజలను అకస్మాత్తుగా ఇప్పటికిప్పుడు రోడ్డు విస్తరణ పేరుతో ఖాళీ చేయాలని చెప్పటం సమంజసం కాదన్నారు. కాలువ కట్ట పక్కన నివాసం ఉంటున్న స్థలాలన్నీ తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసినట్లు కనిపిస్తోందన్నారు. అక్కడ నివాసం వున్న వారందరూ రోజూ కూలీలే అన్నారు. కెనాల్ కట్ట పక్కన ఉన్న పట్టా భూములకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే రోడ్డుకు ఉపయోగించుకోవాలని వారు డిమాండ్ చేశారు. నగరంలో నగర నడిబొడ్డున అనేక రోడ్లు ఇరుకుగా ఉన్నాయని, వాటిని విస్తరించాల్సిన అవసరమున్నా ఆ పని చేయడం లేదన్నారు. ఈనెల 28న క్షేత్ర స్థాయి పర్యటన చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో మైనుద్దిన్, మునెయ్య పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని శనివారం పాత బస్టాండ్ సిఐటియు జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా కార్యదర్శులు బి. మనోహర్, దస్తగిరి రెడ్డి, అన్వేష్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దోచి పెడుతుందని విమర్శించారు. దేశ ప్రజలపై మరింత పన్నుల భారం మోపి మధ్యతరగతి, సామాన్య ప్రజలు జీవించలేని స్థితికి నెట్టవేసిందని తెలిపారు. దేశ ప్రజలు కూడబెట్టుకున్న ప్రభుత్వ రంగ ఆస్తులను తెగ నమ్ముతుందని చెప్పారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని విమర్శించారు. రైతు హక్కులను, చట్టాలను నిర్వీరం చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, శివకుమార్ ఎ. గోపాలకృష్ణయ్య, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. లక్ష్మీదేవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి, రిమ్స్ నాయకులు పవన్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** చలో ఢిల్లీ కార్మిక కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని జమ్మలమడుగు సిఐటియు పట్టణ కమిటీ సభ్యులు దాసు, దాసరి.విజయ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక ఎన్జీవో లో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్ ,సిఐటియు ఆటో యూనియన్ నాయకులు దివాకర్ రాజు, చిన్న, కృష్ణ, భాష, శ్రీనివాసులులి పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన

ఎంపికలకు అధిక సంఖ్యలో హాజరైన బాలికలు

కడప : మహిళా క్రికెట్ శిక్షణ, స్కాలర్షిప్ కోసం శనివారం కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియం క్రికెట్ నెట్స్‌లో నిర్వహించిన ఎంపి కలకు విశేష స్పందన లభిం చింది. భారత క్రికెట్ దిగ్గజాల అయినటువంటి రవి శాస్త్రి గారి నేతృత్వంలో హిందుస్థాన్ యూని వేర్ లిమిటెడ్ సంస్థ సభ్యులు పీఎంఎస్ రెడ్డి, ఎంజే సాల్మన్, పుస్తె నరేష్, జి సునీల్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో మహిళల క్రికెట్ శిక్షణ, స్కాలర్షిప్ కోసం ఎంపికలు నిర్వ హిం చి ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా క్రికెట్ అసో సియేషన్ అధ్యక్షులు ఎం. భరత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్, ఏసీ ఏ సౌత్ జోన్ కన్వీనర్ పి. సంజయ్ కుమార్ రెడ్డి, ఉమెన్ కో-ఆర్డినేటర్ విష్ణుమోహన్‌రావు, సభ్యులు హాజరైయ్యారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

రూ. 10.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్

మైదుకూరు రూరల్ పోలీసులు ఇద్దరు కరడు గట్టిన అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసివారి వద్ద నుంచి రూ.10 లక్షల 25 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలతో ఆభరణాలతో పాటు దొంగతనాలకు వినియోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు నిందితులు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 42 చోరీ కేసుల్లో పాల్గొన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. వై.ఎస్.ఆర్ జిల్లాలో 28 కేసులు, కర్నూలు జిల్లాలో 8, గుంతకల్ రైల్వే పరిధిలో రెండు, తెలంగాణ లో 4 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులు తిమ్మారెడ్డి, మహమ్మద్ రఫీపై ఆంధ్ర ప్రదేశ్ లోని వివిధ జిల్లాల్లో 38 పోలీస్ కేసులు ఉండగా, తెలంగాణలో రెండు కేసులు ఉన్నాయని తెలిపారు. మల్లె భరత్ కుమార్‌పై గతంలో రెండు కేసులు ఉన్నాయని చెప్పారు. కరుడుగట్టిన అంతరాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తును రికవరీ చేయడంలో కృషిచేసిన మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, రూరల్ సిఐ నరేంద్ర రెడ్డి, ఖాజీపేట ఎస్.ఐ కుళ్లాయప్ప, సిబ్బందిని అభినందించి నగదు రివార్డులు అందచేశారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మించాలి

కడప అర్బన్ : డ్రగ్స్, మత్తు రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని జిల్లా వికలాంగుల, సంక్షేమ వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.వి. కృష్ణ కిషోర్ పిలుపునిచ్చారు. యోగివేమన యూనివర్సిటీలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల వాడటం వల్ల కల్గి అనర్థాలను, నష్టాలను జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ అడిక్షన్‌ను పోగొట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి జిల్లాకు ఒక డ్రగ్ అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. మత్తు పదార్థాలు వాడడం వల్ల కలిగే నస్టాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా సైకాలజిస్ట్ ప్రొఫెసర్ వెంకటరాముడు వివరించారు. విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని వైవీయూ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి చెప్పారు. గంజాయి, హెరాయిన్ లాంటి ఉత్పత్తులు ఉపయోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శ్రీనివాసులు పేర్కొన్నారు. విద్యార్థులు, యువత సరైన మార్గంలో నడవాలని, అందుకు క్రమ శిక్షణ ముఖ్యమని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

పేదలకు అన్నదానం

కడప అర్బన్ : సినీ నటుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అప్సర సర్కిల్‌లో చిరంజీవి యువత జిల్లాఅధ్యక్షుడు పంద్రా రంజిత్ కుమార్, వారి బృందం ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా దుర్గా సంస్థల అధినేత దుర్గాప్రసాద్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. . కార్యక్రమంలో కడప నగర అధ్యక్షులు హబీబుల్లా,శివరాం, అంజి, చిన్న, వెంకట సురేంద్ర, బోరెడ్డి నాగేంద్ర, సురేష్, బాలాజీ, శివ, ఆకుల గోపి, శేషు రాయల్, సితార చెరి, ఈశ్వర్, సద్దాం, రామకృష్ణ, థియేటర్ సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లు పంపిణీ

కడప : కడప కోర్టు కాంప్లెక్స్ లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రాసెస్ సర్వర్‌లకు జిపిఎస్ ఎనేబుల్డ్ మొబైల్ ఫోన్లను శనివారం జిల్లా జడ్జి సి.ఎన్.మూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎక్కువ పారదర్శకత, సమ్మన్స్ జారీ, డెలివరీ ప్రక్రియలను వేగవంతం చేయడానికి హైకోర్టు ఆదేశాల ప్రకారం ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లు ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రాసెస్ సర్వర్‌లకు అందజేశారు.

యువకవులకు మార్గదర్శకం 'వైసివి రెడ్డి'

ప్రజాశక్తి కడప అర్బన్

యువకవులకు మార్గదర్శకం కవి వైసివి రెడ్డి అని, ఆయన ప్రేరణ వల్లనే జిల్లాలో చాలామంది యువకులు కథకులుగా తయారయ్యారని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో వైసివిరెడ్డి 98వ జయంతిని నిర్వహించారు. ముందుగా వైసివి రెడ్డి పెద్దకుమారుడు ప్రతాపరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి వైసివిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, పాఠకులు సురేష్ పాల్గొన్నారు.

పోరాట యోధులు గుంటూరు బాపనయ్య : సిపిఎం

ప్రజాశక్తి కడప అర్బన్

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన యోధులు, మార్క్సిస్టు గుంటూరు పాపన్నయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ అన్నారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాపనయ్య 25వ వర్ధంతి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య అట్టడుగు పేద వర్గాల నుంచి వచ్చి, స్వయంకృషితో విద్యనభ్యసించి, మార్క్సిస్టుగా మారారని చెప్పారు. విద్యార్థి, యువజన , వ్యవసాయ కార్మికుల, కమ్యూనిస్టు ఉద్యమాల్లో సుదీర్ఘకాలం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించారని తెలిపారు.1952 నుంచి 4 దఫాలు ఎమ్మెల్యేగాను, 2దఫాలు ఎమ్మెల్సీ గాను చట్టసభలకు ఎన్నికై, ప్రజా సమస్యలపై రాజీలేకుండా చట్టసభల్లో పోరాడారని పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, బసవ పున్నయ్య లాంటి మార్క్సిస్టు ఉద్యమ నిర్మాతలతో కలిసి పని చేశారని గుర్తు చేశారు. నేటికీ వారి పిల్లలు గుంటూరు కూరగాయల మార్కెట్లో కూరగాయలు అమ్ముకుంటూ, చిరు వ్యాపారాలతో జీవిస్తున్నారని చెప్పారు. తమ పిల్లలు పని చేసుకుని జీవించడాన్ని గుంటూరు బాపనయ్య జీవించిన కాలంలోనే గౌరవంగా భావించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక భూ పోరాటాలకు నాయకత్వం వహించి భూమిలేని గ్రామీణ నిరుపేదలకు భూమి పంచారని, అనేక వందల, వేల, లక్షల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి కావడానికి ఆయన చేసిన కృషి చాలా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శివకుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసు రెడ్డి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కడప నగర ఐటిడిపి కమిటీ నియామకం

కడప అర్బన్ : నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి అమీర్ బాబు ఆదేశాల మేరకు నగర ఐ టిడిపి అధ్యక్షునిగా డాక్టర్ జి. వరకుమార్, ఉపాధ్యక్షునిగా ఎల్లటూరు అజ్మతుల్లా, ప్రధాన కార్యదర్శిగా మేకల దేవ ని నియమించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, అడ్వకేట్ లింగాల శివశంకర్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, తెలుగు యువత అధ్యక్షుడు మేకల వెంకటేశు, 47 వ డివిజన్ ఇన్‌ఛార్జి జనార్ధన్ రెడ్డి , 11వ డివిజన్ శివ, 5 డివిజన్ ఇన్‌ఛార్జి బండి జయ శేఖర్, నగర కార్యనిర్వాహక కార్యదర్శి బసిరెడ్డి రమణారెడ్డి, బి. వెంకటేశ్, సంపత్, 3 డివిజన్ శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

విద్యార్థులతో టిడిపి నాయకులు

కడప అర్బన్ : పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్ మెయిన్‌లో మసాపేట శివ ఆధ్వ ర్యంలో పంపిణీ అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ జీలాని బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులు బాగా చదివి ఏప్రిల్ 3 నుంచి నిర్వహించబోయే పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడుగునూరు రాజశేఖర్, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జియా ఉద్దీన్, ఎస్టీ సెల్ నగర అధ్యక్షులు భాస్కర్, గ్రంథాలయ మాజీ డైరెక్టర్ హమీద్ బుకారి, టిఎన్‌ఎస్‌ఎఫ్.నగర అధ్యక్షుడు అనిల్, కడప పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ విశ్వనాథ్, ఎస్సి నగర కార్యదర్శి బిల్లా నవీన్, ఎస్సి సెల్ పార్లమెంట్ కార్యదర్శి టి.జీవన్ పౌల్, స్కూల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు

చింతకొమ్మదిన్నె: రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయాలని కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. శనివారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో భూసార పరీక్ష ఆవశ్యకత, మట్టి నమూనా సేకరణ పద్ధతి పై రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా పంటలు, ఎరువుల యాజమాన్యంలో సలహాలు సూచనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. ఏరువాక కో- ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయంలో పర్యావరణ సమతుల్యత, పర్యావరణ స్థిరత్వం కోసం భూసార ఆధారిత సమగ్ర పోషక యాజమాన్యం ఎంతో అవసరమని చెప్పారు. భూసార ఆధారిత పంటలు ఎంపికతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. మరో శాస్త్రవేత్త సాయి మహేశ్వరి మాట్లాడుతూ సేద్య విభాగం ఆరుతడి పంటలలోనూ యూరియా, పండ్లతోటల్లోనూ భూసార పరీక్షలు, జాగ్రత్తల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేష్ బాబు, లావణ్య, మానస, ప్రత్యూష, శిల్పకళ, స్వామి చైతన్య రైతులు పాల్గొన్నారు.

అచ్చన్న మృతికి కారణమైన వారిని శిక్షించాలి

కడప : జిల్లా పశువర్ధక శాఖలో జిల్లా డిడిగా పనిచేస్తున్న అచ్చన్న మృతికి కారుకులైన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని ఎసిసి సభ్యులు బండి జకరయ్య డిమాండ్ చేశారు. శనివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువర్ధక శాఖలో ఏం జరుగుతుందో జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి అక్కడ ఎవరెవరు ఏమేమి పనులు చేస్తున్నారో ఒక కమిటీ వేసి దాని ద్వారా విచారణ చేపట్టాలని అన్నారు. **కడప అర్బన్ :** జిల్లా పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా పని చేస్తున్న దళిత ఉద్యోగి అచ్చన్న మృతి పై న్యాయ విచారణ జరిపించాలని దోస్తులను కఠినంగా శిక్షించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జి సగిలి గుర్రప్ప, జిల్లా అధ్యక్షులు డి.ఎస్. జయరాం డిమాండ్ చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ దళితులపై దళిత అధికారులపై హత్యలు, అత్యాచారాలు పరిపాటిగా మారాయన్నారు.

విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచాలి

కడప : విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యతను పెంపొందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. శనివారం ప్రభుత్వ పురుషుల కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -3 ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపును శివానందపురంలో నిర్వహించారు. ప్రిన్సిపల్, యోగి వేమన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి ప్రత్యేక క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -3 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి, జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి రవి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయిని సృజన ప్రియ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆందోళనపథం

ప్రజా'దృష్టి'

ప్రభుత్వం క్షేత్రస్థాయి సిబ్బంది సేవల కారణంగానే సామాజిక పురోభివృద్ధి సాధిస్తోంది. ఇటువంటి వారి న్యాయమైన డిమాండ్లను సానుకూల దృక్కోణంలో ముందుకెళ్లాలి. కానీ కొన్ని దశాబ్దాలుగా క్షేత్రస్థాయి సిబ్బంది హక్కుల గురించి ప్రస్తావన వినగానే ఉలిక్కి పడుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది సేవల ఆధారంగానే ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాధి రాష్ట్రాల్లో ముందు వరుసలో ఉండడం కొనసాగుతోంది. తొలి, మలి స్థానాల కోసం పోటీపడుతోంది. ఇటువంటి కేటగిరీలో మొదటి స్థానంలో నిలుస్తున్న అంగన్వాడీ కార్యకర్తల సేవల ఆధారంగానే రాష్ట్రం ఇటీవల మానవాభివృద్ధి సూచికల్లో మెరుగుదల సాధిస్తోంది. అటువంటి కార్యకర్తలను గుర్తించి, వారికి ప్రోత్సాహకాలు అందించి సముచితంగా గౌరవించాలి. కానీ అటు వంటి అంగన్వాడీ సేవలకు ప్రతిఫలంగా వారి హక్కులను, డిమాండ్లను గుర్తించాల్సిందిపోయి నిర్బంధానికి పాల్పడుతోంది. నిరసన పిలుపు వినగానే ముందురోజు హౌస్ అరెస్టు మొదలుకుని ఎక్కడిక్కడ నిరసన కార్యకలాపాలకు అడ్డంకులు కలిగిస్తోంది. అయినప్పటికీ కార్మిక సంఘం పోలీసు నిర్బంధాలను లెక్క చేయకుండా అంగన్వాడీలను ఆందోళనబాట పట్టించడం పాలకులను నివ్వెరపరిచింది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట కార్మిక లోకం నిర్బంధాలకు వెరవకుండా ఉద్యమించాలి. లేనిపక్షంలో కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు అరుదైన అవకాశాన్ని చేజార్చుకున్నట్లు అవుతుందని గ్రహించాలి. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు ఏడు వేల మందికిపైగా అంగన్వాడీలు ఉన్నారు. వీరందరికీ సిఐటియు, ఎఐటియుసి సంఘాలు నాయకత్వం వహిస్తుండడం తెలిసిందే. అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను అంగీకరించి అమలు చేయాల్సి ఉంది. చాలీచాలని వేతనాలతో కడుపులు కాలే కార్మికుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించాల్సి ఉంది. అంగ న్వాడీల జీతాలను తెలంగాణా రాష్ట్రం తరహాలో పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేయడం నేరంగా మారింది. అంగన్వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మహిళల్లో రక్తహీనత, గర్భిణులకు వైద్యచికిత్సలు, సలహాలు అందించడం, పిల్లల్లో రక్తహీనత, ప్రైమరీ విద్యను అందించడం వంటి సామాజికాభివృద్ధిలో కీలకపాత్ర పోషించడం తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కళ్లు, కాళ్లుగా మారిన అంగన్వాడీలను గుర్తించి గౌరవించాల్సి ఉంది. ఇటువంటి అంగన్వాడీల నిరుపమాన సేవలను కొనియాడాలి, కానీ వారి న్యాయమైన హక్కులు, డిమాండ్లపై ఉక్కుపాదం మోపడం విస్మ యాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యంలో తమకు జరిగిన అన్యాయాన్ని నిరసన రూపంలో వెల్లడించే ప్రజాస్వామ్య హక్కును సైతం లాగే సుకునే నియంతృత్వ పోకడలకు పాల్పడడం విస్మయాన్ని కలిగిస్తోంది. దేశంలో, రాష్ట్రాల్లో ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికుల కష్టాలు పెచ్చు మీరుతూనే ఉంటాయనే చరిత్ర నిరూపించిన చారి త్రక సత్యం, ఇటువంటి అనుభవ పరిస్థితుల నేపథ్యంలో అంగన్వాడీలతోపాటు క్షేత్రస్థాయిలో పని చేసి సంపదను సృష్టించే కార్మిక, కర్షకలోకం రాజకీయంగా చైతన్యవంతం కావాలి. లేనిపక్షంలో పిడికెడు మంది కార్పొరేట్ల ఉక్కు పిడికిళ్ల మధ్య కార్మికులు, కర్షకులు, సామాన్యులు విలవిలాడుతూ బతుకులీడాల్సి ఉంటుందనే స్పృహను, చైతన్యాన్ని, ఎరుకను కలిగినప్పుడే రాజ్యాంగ లక్ష్యమైన సమ సమాజ సాకారం సాధ్యపడుతుందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రజల సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ముఖ్యమంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో ప్రజల విన్నతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రతినిధులను ప్రజల ఇంటి వద్దకే పంపి వారి సమస్యలను ఎప్పటికీ ఎప్పుడు పరిష్కరించేందుకు గడప గడప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని జగనన్న ఆకాంక్ష అన్నారు. ప్రజల విన్నతులను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు.

పంచాయతీకి రూ.2 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-చెన్నూరు

వేలం పాట ద్వారా పంచాయతీకి రూ.2 లక్షల ఆదాయం వచ్చిందని కార్యదర్శి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బస్టాండ్, కూరగాయల మార్కెట్, జంతువధశాల, వేలంపాట ద్వారా సుమారు రూ.2.50 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. వేలం పాట డిఎల్‌పిఒ మస్తాన్‌వలి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సురేష్‌బాబు సమక్షంలో నిర్వహించారు. బస్టాండ్ వేలం ద్వారా రూ. 1,04,000, కూరగాయల మార్కెట్ ద్వారా రూ.2,500, జంతు వధశాల ద్వారా రూ.36,500 ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. **వేంపల్లెలో రూ.33 లక్షల ఆదాయం** సంత వేలం పాట ద్వారా వేంపల్లె పంచాయతీకి రూ. 33 లక్షలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, సర్పంచి రాచినేని శ్రీనివాసులు చెప్పారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు అధ్యక్షతన సంత మార్కెట్ కు వేలం పాట నిర్వహించారు. దీంతో ముగ్గురు వ్యక్తులు వేలం పాటలో పాల్గొన్నారు. ముగ్గురు వ్యక్తులు పోటీ పడగా రూ. 33 లక్షలకు రామగంగిరెడ్డి అనే వ్యక్తి హెచ్చు పాటను పాడి సంత మార్కెట్‌ను సొంతం చేసుకున్నారు. అలాగే మెయిన్ బజారులో ఉన్న పంచాయతీ వాణిజ్య గదులు 10 శాతం బాడుగలు పెంచి పాత వారికే ఇచ్చారు. వాణిజ్య గదులు మూడు సంవత్సరాలకు ఒక సారి వేలం పాటలు వేయాలని దుకాణాదారులు కోరగా ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తామని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు. . గతంలో సంత మార్కెట్ కు రూ 30.30 లక్షలు మాత్రమే పాట పడినట్లు చెప్పారు. ఈసారి అదనంగా రూ 2.70 లక్షలు వచ్చాయన్నారు.

మొక్కలు నాటుతున్న కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని వేదవ్యాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దొరసానిపల్లెలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎల్. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కళాశాల ప్రెసిడెంట్ జి. సుదర్శన రెడ్డి మాట్లాడుతూ మానవ మనుగడ వృక్షాలతోనే ఆధారపడి ఉందని, వృక్షాలను మనం రక్షిస్తే అవి మానవ మనుగడను రక్షిస్తాయని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. రామలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె. నాగరాజ, ఎస్‌పి. యాసిస్ విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి జయశ్రీకి గోల్డ్‌మెడల్

వేంపల్లె : మండలంలోని పాములూరు గ్రామానికి చెందిన జయశ్రీ అనే విద్యార్థి మెడిసిన్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. వేంపల్లె మండలంలో జర్నలిస్టుగా పని చేస్తున్న అమర్నాథరెడ్డి, గంగాదేవిల కుమార్తె జయశ్రీకి 2017లో మెడిసిన్‌లో చేరారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన కాన్వగేషన్ కార్యక్రమంలో జయశ్రీకి తిరుపతి సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమాంబ చేతుల మీదుగా గోల్డుమెడల్ అందుకున్నారు. వేంపల్లెకు చెందిన విద్యార్థి జయశ్రీ మెడిసిన్ లో గోల్డుమెడల్ సాధించడం పట్ల తల్లిదండ్రులతో పాటు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

శుభకార్యంలో విషాదం

నీళ్ల టెంకాయ కోస్తూ విద్యుత్ తీగలపై పడి బిటెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-లింగాల

ఇంటికి వచ్చిన చుట్టాలతో ఆ ఇల్లు కళకళలాడింది. అందరూ ఆ శుభకార్యంలో ఆనందంగా గడుపుతున్న వేళ విషాదం చోటు చేసుకుంది. పచ్చి (నీళ్ల) టెంకాయ ఓ యువకుడి ప్రాణం తీసిన సంఘటన శనివారం మండలంలోని లోపట్నూతల గ్రామంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని లోపట్నూతల గ్రామానికి చెందిన వెంకట మునింద్రారెడ్డి, గంగాభవాని దంపతుల కుమారుడు దిలీప్‌కుమార్‌రెడ్డి (19). అతను బిటెక్ చదువుతున్నాడు. శనివారం నూతన గృహప్రవేశం సందర్భంగా సత్య నారాయణ స్వామి వ్రతం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, బంధువుల పలకరింపులతో ఆ ఇల్లు సందడిగా మారింది. ఆ సమయంలో పచ్చి టెంకాయ కచ్చితంగా కావాలని వేద పండితులు చెప్పడంతో దిలీప్ కుమార్ రెడ్డి గ్రామ సమీపంలో ఉన్నతోట వద్దకు వెళ్లి చెట్టు ఎక్కి టెంకాయ కోసి కిందికి వేశాడు. చెట్టు దిగే సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ వైర్ తగిలి కింద పడ్డాడు. వెంటనే స్థానికులు అతన్ని హుటాహుటినా పులివెందుల ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలోనేగాక గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. శుభకార్యం రోజు కుమారుడిని పోగొట్టుకున్న తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. లింగాల పోలీసులు మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రి వద్ద సేవ పరీక్ష నిర్వహించి మృతదేహాన్ని వారి బంధువులు అప్పగించారు.

రేబిస్ వ్యాధితో వృద్ధురాలు మృతి

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామానికి చెందిన పాలగిరి పర్వతమ్మ (70) శనివారం రేబిస్ వ్యాధితో కడపలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వెదురూరు గ్రామంలో ఫిబ్రవరి 18న పార్వతమ్మ కుక్క కాటుకు గురయ్యారు. అప్పటినుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు విడతల్లో సూదులు వేయించుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున తల తిరగడంతో అస్వస్థకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు కడపకు వైద్యం కోసం తరలించారు. అక్కడ పరీక్షలు చేసి రేబిస్ వ్యాధిగా గుర్తించారు. శనివారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఇప్పటికైనా అధికారులు కుక్కలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కక్ష సాధింపులు మితిమీరుతున్నాయి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతిపక్షాలపై కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వ కక్ష రాజకీయాలు మితి మీరుతున్నాయాని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై వేసిన అనర్హత వేటుకు నిరసనగా వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు నల్ల జెండాలు పట్టుకొని ప్రధాని మోడీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని చెప్పారు. భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి పరాకాష్ఠ అన్నారు. బిజెపి నాయకులను రాహుల్ ఫోబియా వెంటాడుతున్నదని చెప్పారు. బిజెపి నాయకుల తాటాకు చప్పుళ్లకు కాంగ్రెస్ ఎన్నడూ భయపడదని హెచ్చరించారు. దొంగలందరికి మోడీ పేర్లు ఉన్నాయని రాహుల్ గాంధీ చెప్పడం వల్ల సూరత్ జిల్లా కోర్టు రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించడం శోచనీయం అన్నారు. అనర్హత వేటుపై గాంధేయ, ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయ పోరాటం, ప్రజా పోరాటం చేస్తామని తెలిపారు. దీక్షలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, ఓబయ్య, చెన్నకేశవ, ప్రొద్దుటూరు అసెంబ్లీ ఇన్ చార్జ్ పూల నజీర్, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, అమర్, ఉత్తన్న, సుబ్బరాయుడు, బద్రీ, వెంకటేష్, శివ, విజయకుమార్, బాబు, రాఘవయ్య, జానకీరామ్, రవి, ఇస్మాయిల్, శివారెడ్డి పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్ :** జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం రాజకీయ కక్షలో భాగమేనని ఇలాంటి చర్యలు చూస్తుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అర్థమవుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వ వైఖరికి నిరసనగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు నోటికి నల్లరిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బుడిగి శ్రీను, ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలు రఫీ, ముజాహిద్, పాల్గొన్నారు. **చెన్నూరు :** రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వంపై వేటు బిజెపి పతనానికి నాందని అని కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొట్టి పాటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విపక్షాలపై కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నారని ఆయన అన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన

కడప : రాహుల్ గాంధీ పై బిజెపి, ఆర్ఎస్ఎస్ పన్నుతున్న కుట్రలను నిరసిస్తూ శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ నగర కమిటీ అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కడపలోని ఐటిఐ సర్కిల్ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. నరేంద్ర మోడీ, ఆర్ఎస్ఎస్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. నరేంద్ర మోడీ ముఖచిత్రం గల కాగితాలను దహనం చేశారు. అనంతరం అక్కడి నుండి బిజెపి కార్యాలయం ముట్టడించేందుకు ర్యాలీగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో నిరసన కారులు, పోలీసుల మధ్య వాగ్వాదం తోపులాట చోటు చేసుకుంది. ఎట్టకేలకు పోలీసులు బిజెపి కార్యాలయాన్ని ముట్టడించకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలువరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నగర కమిటీ అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ మాట్లాడుతూ 2024లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక తప్పదని, అప్పుడు నరేంద్ర మోడీ అక్రమాలు వెలికి తీసి, బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

మహిళలకు బాసట 'వైఎస్ఆర్ ఆసరా'

లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్ఆర్ ఆసరా' పథకం ఎస్‌హెచ్‌సి మహిళలకు ఆర్థిక ప్రగతికి బాసటగా నిలిచిందని ఎపిఎస్ఆర్‌టిసి ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు నుంచి మంత్రులు, సంబందిత ముఖ్య కార్యదర్శులతో కలిసి 3వ విడత వైఎస్ఆర్ ఆసరా' పథక లబ్ది మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి ఎపిఎస్ఆర్‌టిసి ఛైర్మన్‌తోపాటు డిఆర్‌డిఎ , మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర సగర కార్పొరేషన్ ఛైర్మెన్ గానుగపెంట రమణమ్మ, హజ్ హౌస్ ఛైర్మన్ గౌసులాజాం, హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం స్థానిక విసి హాలులో జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 30635 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు మంజూరైన రూ. 257.84 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహిళలు ఆర్థిక స్వావలంభనదిశగా అడుగులు వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా జిల్లా స్వయం సహాయక సంఘాల మహిళలు ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మహిళా సభ్యులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** మహిళా సాధికారతే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. వైఎస్ఆర్ ఆసరా పథకం కింద మూడవ విడత నిధులను ఎంఎల్ఎ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలోని 41 వార్డులకు చెందిన డ్వాక్రా సంఘ సభ్యులకు మూడవ విడత కింద రూ.57కోట్ల91లక్షల9వేల145లు మంజూరయ్యాయన్నారు. వడ్డీ సైతం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా కేవలం పేదరికం మాత్రమే ప్రామాణికంగా తీసుకొని జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేదలకు అందజేస్తోందన్నారు. నియోజకవర్గంలో 24వేల మంది మహిళలకు ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, సహాయ కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నామమాత్రంగా మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశం శనివారం మున్సిపల్ ఛైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నామమాత్రంగా నిర్వహించారు. 2023 –24 కు సంబంధించి రూ. 9,18,25,064 కోట్ల మిగులు బడ్జెట్‌తో ప్రారంభం కాగా, అన్ని శాఖల నుంచి రూ. 10,94,03,600 జమలు రానున్నాయని, మొత్తం రూ. 20,12,28,664 మొత్తంలో అధికారులు బడ్జెట్‌ను తయారు చేసి కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. ఇందులో ఏ ఒక్క కౌన్సిలర్ కానీ, కో – ఆప్షన్ సభ్యులు కానీ జమలు, ఖర్చులపై నోరు మెదపలేదు. కొందరు కౌన్సిలర్లు అయితే బడ్జెట్ ప్రతులను కూడా చూడకపోవడం గమనార్హం.

బిసి జనగణన సదస్సును జయప్రదం చేయాలి

జమ్మలమడుగు రూరల్ : బిసి జనగణన అవగాహన సదస్సును జయప్రదం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి గురుమూర్తి యాదవ్ అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచినా అధిక సంఖ్యకులైన బిసి కులాల జనాభాకి విద్య, ఉద్యోగ, పారిశ్రామిక, రాజకీయ రంగాలలో నేటికీ తగినంత ప్రాధాన్యత లేదన్నారు. దేశానికి బిసి కులాలను వెన్నుముకలని చెప్పడమే కానీ వారి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు వారి జనాభా ఎంత ఉందో కేంద్ర ప్రభుత్వం ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి లెక్కిస్తుందని, కానీ బిసి కులాల జనాభా లెక్కలు తీయమని దశాబ్దాలుగా తాము డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్రంలోని పాలకులు కుంటి సాకులు చెప్పడం అన్యాయం అన్నారు. బీసీ సమస్యలపె ఆదివారం ఉదయం పది గంటలకు ప్రొద్దుటూరులోని పద్మశాలీయ కల్యాణ మండపంలో బిసి జనగణన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్క బిసి హాజరై విజయంతం చేయాలని కోరారు. రిజర్వేషన్లు సామాజిక న్యాయంపై డాక్టర్ మల్లెల భాస్కర్, బిసి కులగనన చారిత్రక ఆవశ్యకతపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం, 'బిసి ఉద్యమ– నేటి ఆవశ్యకత' అనే అంశంపై బీసీ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంగళరావు, 'రాజకీయాలలో బిసిల పాత్ర' గురించి వలిగట్ల రెడ్డప్ప ప్రసంగిస్తారన్నారు. జాతీయ కన్వీనర్, అధ్యక్షులైన నాగేశ్వరరావు, సభ అధ్యక్షులు సోమా లక్ష్మీనరసయ్యలు రానున్నారన్నారు.

మార్కెట్ వేలం మరోసారి వాయిదా

ఎర్రగుంట్ల : స్థానిక నగర పంచాయతీకి సంబంధించి దినసరి మార్కెట్ గేటు వసూళ్లకు సంబంధించిన వేలంపాట మరోమారు వాయిదా పడింది. నగర పంచాయతీకి సంబంధించి సర్కారు పాట రూ.15,33,700 గా అధికారులు నిర్ణయించారు. స్థానిక రాజకీయ నాయకుల జోక్యంతో వేలంపాటను పాడనివ్వకుండా చేస్తున్నారని వాదన ప్రజల్లో బలంగా వినపడుతోంది. 2022– 23 సంవత్సరమునకు సంబంధించిన వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంతవరకు పూర్తి మొత్తం చెల్లించకపోవడం గమనార్హం. కానీ అదే కాంట్రాక్టర్ బినామీ పేరుతో తిరిగి కాంట్రాక్ట్ దక్కించుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులపై అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ విషయంగా కమిషనర్ జగన్నాథ్‌ను వివరణ కోరగా పెద్ద మొత్తం అని కాంట్రాక్టర్లు వేలంపాట పాడడం లేదని సోమవారం తిరిగి వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు.

అవగాహనలేకుండా మాట్లాడితే అబాసుపాలు కాక తప్పదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఎంఎల్‌సి ఎన్నికల గురించి అవగాహనలేకుండా పత్రికా ప్రకటన ఇస్తే అబాసు పాలు కాక తప్పదని వైసిపి కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎంఎల్‌సి ఎన్నికల్లో ఏమాత్రం ప్రచారం చేయకుండా పట్టభద్రులను బిక్షగాళ్లు అనడం హేయనీయమన్నారు. అసలైన బిక్షగాళ్లు టిడిపిలోనే ఉన్నారన్నారు. ఈ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఫోర్జరీ సంతకం విషయమై ప్రవీణ్‌తో పాటు కుతుబుద్దీన్, ముక్తియార్ డబ్బులు పంచుకోలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఇచ్చిన డబ్బులు ఓటర్లకు పంచకుండా మీరు పంచుకోలేదా అన్ని ప్రశ్నించారు.గెలుపోటములు సహజమైనప్పటికీ ప్రయత్నం మాత్రం మనస్ఫూర్తిగా ఉండాలన్నారు. టిడిపి నాయకుడు శెట్టిపల్లి ప్రభాకర్‌కు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఓ వివాహంలో జరిగిన గొడవ అందరికీ తెలిసిందే అన్నారు. ఇప్పటికైనా అవగాహనతో పత్రికా ప్రకటనలు ఇస్తే ఆమోదయోగ్యంగా ఉంటుందని వంశీధర్‌రెడ్డి అన్నారు.

గండి క్షేత్రం అభివృద్ధికి ప్రత్యేక చొరవ : ఎంపీ

చక్రాయపేట : మండలంలోని గండి క్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని ఎంపీ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలోని పడమర రాజగోపురం ఏర్పాటుకు రూ. 2.25 లక్షలు, ప్రకారానికి రూ. 2.40 లక్షలుచ ముఖ మండపానికి రూ. 1. 45 లక్షలు మొత్తం రూ. 6. 10 కోట్లు మంజూరైందని చెప్పారు. ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. తమిళనాడుకు చెందిన నటరాజన్ కంపెనీ ముందుకొచ్చి పనులు ప్రారంభించిందని చెప్పారు. వేంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించిన ఎంపీని వేంపల్లె జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఛైర్మన్ రాఘవేంద్ర, డిఇ గంగయ్య, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

చలివేంద్రం ఏర్పాటు

ముద్దనూరు : స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం పాతబస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సర్పంచ్ సరళ, కార్యదర్శి లక్ష్మినరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రశాంత్, వినయ్ కుమార్, సునీల్,రమేష్ పాల్గొన్నారు.

మీనాపురంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

మాట్లాడుతున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ 1 ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ మీనాపురంలో శని వారం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ టి. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరం వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. రెండో రోజు క్లీన్‌అండ్ గ్రీన్, మూడో రోజు మొక్కలు నాటడం, నాల్గో రోజు వైద్య శిబిరం, ఐదో రోజు వాటర్‌ట్యాంక్‌ను శుభ్రపరచడం, ఆరో రోజు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, వాలంటీర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చేది మన ప్రభుత్వమే : టిడిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వచ్చేది మన ప్రభుత్వమే అని, ఎవ్వరు అధైర్య పడవద్దని టిడిపి ఇన్‌ఛార్జి జి.వి ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. "నివారం మున్సిపాలిటీ పరిధిలోని దస్తగిరి పేటలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఫిట్టర్ రఫీ,రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ముల్ల అలిబేగ్, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, విమల్,మస్తాన్ గోలే, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్,సాన విజయభాస్కర్ రెడ్డి,యమ్మనూరు ఆంజనేయులు,పెన్నా నగర్ మజీద్, గోపవరం గౌస్, పట్నం మాబాష, ఇర్ఫాన్, సుదర్శన్, శివ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

రంజాన్ మాసం పురస్కరించుకుని పట్టణంలోని జామియా మసీదులో ఉపవాస దీక్షలు పాటిస్తున్న ముస్లిం సోదరులకు జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షాదిక్ పాషా ఖాదిరి ఆధ్వర్యంలో మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఉపవాస దీక్షలు పాటించే వారందరూ మియా మసీదుకు వచ్చి ఉపవాస దీక్షలు విరమించి 5 పూటలా నమాజు ఆచరించాలని తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించడం వల్ల ఆయురారోగ్యాలు లభించడంతోపాటు కుటుంబం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు పీఠాధిపతి కుటుంబీకులు ముస్లిం పెద్దలు, చిన్నారులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఉన్న కంకరను తొలగిస్తున్న విద్యార్థులు

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

సమాజం బాగుపడాలంటే సమాజ సేవలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజినేయులు అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఆవరణంలో ఉన్న కంకర, మట్టిని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తొలగించి శుభ్రంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమాజ సేవ కోసం ఆయా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరం అన్నారు. సమాజంలో బంధం ఏర్పాటు అవ్వడంతో పాటు ఆయా ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడిచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఒక పక్క చదువు, మరో వైపు సేవా కార్యక్రమాలు చేపట్టాలని విద్యార్థులను ఆయన కోరారు. మదర్ థెరిస్సాను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం గోవిందు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా తమ పాఠశాల ఆవరణం శుభ్రంగా చేసినందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక శిబిరం వారం రోజుల పాటు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పిడి తేజేంద్ర, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

'గురుకులం'లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - వేంపల్లె

మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని వేంపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎన్. హరిత ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 ఏడాదికి గాను 5వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు. వేంపల్లెలోని ఎంజెపి ఎపి బిసి బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 40 సీట్లు ఉన్నట్లు చెప్పారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసి బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు https:// mjpapbcwreis.apcfss.in వెబ్ సైట్ లో చూడ వచ్చున్నారు. ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - కడప

టిడిపి జాతియ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, వారి కుటుంబ సభ్యుల పైన అసభ్య పదజాలంతో ప్రజా యాప్‌లో పోస్టులు పెట్టిన వ్యక్తి పైన చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా యాప్‌లో వైసిపి పేటిఎం బ్యాచ్‌కు చెందిన వ్యక్తి వారం రోజులుగా టిడిపి అగ్రాయకత్వంపై అసభ్యకరమైన, అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్ ఉపయోగిస్తూ వారి పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా పోస్టులు పెడుతున్నాడని అన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా హిందూ ముస్లిం ఐక్యత దెబ్బతీసే విధంగా, మతాల మధ్య చిచ్చు రేపే విధంగా పోస్టులు పెట్టిన వ్యక్తి పైన సరైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 22వ డివిజన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, 44వ డివిజన్ ఇన్‌ఛార్జి పటం పఠాన్ ఖాజా, 46వ డివిజన్ ఇన్‌చార్జ్ భరత్ కుమార్, అనిల్ పాల్గొన్నారు.

పులివెందుల తరహాలో అభివృద్ధి చేస్తాం

వేంపల్లె : పులివెందుల తరహాలో వేంపల్లెను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్దం చేస్తున్నట్లు ప్లానింగ్ కమిషనర్ విజయకుమార్ చెప్పారు. శనివారం వేంపల్లెలో ఉన్న హనుమాన్, ఎన్టీఆర్, నాలుగు రోడ్ల కూడళ్లను అధికారులతో కలిసి ప్లానింగ్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో ఉన్న కూడళ్లను ఏ విధంగా అభివృద్ధి చేశామో అవిధంగా వేంపల్లెలోనూ అభివృద్ధి చేసేందుకు సర్కిళ్లను పరిశీలిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వేంపల్లెలో ఉన్న కూడళ్లను తనిఖీ చేశామన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా సర్కిళ్లను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన వెంట పులివెందుల ఓఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సర్వేయర్ శివారెడ్డి, ఆర్కిటిక్, రోడ్లు భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదరపల్లిలో రూ. 50 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపినట్లు ఆర్అండ్‌బి ఎఇ దాదాబాష తెలిపారు. మైదుకూరు – ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుంచి నాగులపల్లి వరకు ఆర్అండ్‌బి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గతంలో ప్రతిపాదనలు పంపమని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదని ప్రస్తుతం గ్రామంలో డ్రెయినేజీ సమస్య వెంటాడుతుండడంతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అత్యవసర నిధుల కింద రూ. యాభై లక్షలు మంజూరు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపామని చెప్పారు. గ్రామంలో మసీదు సమీపంలో వర్షం నీరు నిలుస్తూ అధ్వానంగా ఉందన్నారు. డ్రెయినేజీ కాలువలతో పాటు సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేస్తే ప్రజలకు సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు చేపడతామని ఆయన సూచించారు.

ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా బొజ్జా తిరుమలేష్

ప్రజాశక్తి - కడప



ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్‌కు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు అసెంబ్లీ నియోజకవవర్గానికి సంబంధించి ఎన్నికల కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూత్ కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రాయచూర్ అసెంబ్లీ గెలుపు దిశగా అక్కడ నాయకులను సమన్వయం చేసుకొని పని చేస్తానన్నారు.

రెడ్యంను పరామర్శించిన విజయమ్మ

ఖాజీపేట : టిడిపి నాయకులు రెడ్యం వెంకసుబ్బారెడ్డిని బద్వేల్ నియోజకవర్గం మాజీ ఎంఎల్ఎ విజయమ్మ శనివారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రెడ్యంకు గుండెపోటు వచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శనివారం ఆమె పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరాతీశారు. ఆమె వెంట టిడిపి సీనియర్ నాయకులు, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ గాజులపల్లిరామకోటి రెడ్డి, టిడిపి బిసి నాయకులు శీర్ల నాగయ్య యాదవ్, కొండపల్లి శేషగిరి, దండుబోయిన నారాయణ యాదవ్, మిత్తికాయల రమణ యాదవ్, టిఎన్ఎస్‌ఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరెడ్డి జగదీశ్వర్ రెడ్డి ఉన్నారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపు

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లెలో సోమవారం నుంచి మూడు రోజులపాటు ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. 2010 – 2016 సంవత్సరాల మధ్య ఆధార్ తీయించుకున్న ప్రతి ఒక్కరూ ప్రస్తుతం అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. వయస్సు, పేరు, చిరునామా, తదితర మార్పుల కోసం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

చాపాడు : మండల పరిధిలోని టిఓ పల్లెలో నూతనంగా నిర్మించిన పోతురాజు సమేత అంకాలమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. బుధవారం వరకు వివిధ కార్యాక్రమాలుంటాయన్నారు. మూడు రోజులపాటు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. టి. సుబ్బయ్య శర్మ, ఒ. సీతారామ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.